# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో హరిత ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- హడ్కో, అర్బన్ అథారిటీల సహకారంతో టిడ్కో గృహాలకు మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి పి.నారాయణ తెలిపారు.

- కవయిత్రి మొల్లమాంబ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

- ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్టీఆర్ వైద్య సేవతో సమానంగా వైద్యం అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలియజేశారు.

====================

రాష్ట్రంలో తలసరి విద్యుత్ వినియోగం 23 శాతం మేర పెరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు శాసనసభలో ఇంధన శాఖపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ... సౌర, పవన విద్యుత్‌ను 7 వేల 700 మెగావాట్ల మేర ఉత్పత్తి చేసిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. 2014లో రాష్ట్రంలో 22.5 మిలియన్ యూనిట్ల కరెంట్ కొరత ఉండేదని, కేంద్ర ప్రభుత్వం సహకారంతో 2014 డిసెంబర్ నాటికి ఎక్కడా కరెంట్ కొరత లేకుండా చేసి, జనవరి 2018 నాటికి మిగులు విద్యుత్ సాధించిన రాష్ట్రంగా మార్చామని అన్నారు. భూతాపాన్ని అరికట్టేందుకు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయన్నారు. దీనిలో భాగంగా సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ, బయోఫ్యూయెల్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను స్మార్ట్ గ్రిడ్ ద్వారా సరఫరా చేయాలని ప్రయత్నం చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

====================

నిర్మాణంలో ఉన్న 3 లక్షల 65 వేల 430 చదరపు అడుగుల టిడ్కో గృహాలను ఈ సంవత్సరం జూన్ 12 నాటికి పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. ఈరోజు శాసన సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ... టిడ్కో ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు హడ్కో 4 వేల 460 కోట్ల రూపాయల రుణం అందజేస్తుందని, అర్బన్ అథారిటీల సహకారంతో మౌలిక వసతుల కల్పన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 77 వేల 606 మందికి ఇళ్లు ఇవ్వకుండానే వారి పేరు మీద బ్యాంకు లోన్ తీసుకోవడం జరిగిందని, దీనివల్ల ఇళ్ళు లేకుండానే వారిపై నెలవారీ వాయిదాల చెల్లింపుల భారం పడిందని పేర్కొన్నారు. విశాఖలో మెట్రో రైల్ కారిడార్ లపై 2051 సంవత్సరం నాటికి ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని డీపీఆర్ రూపొందించామని మంత్రి మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పీక్ అవర్ పాసింజర్ డైవర్షన్ ట్రాఫిక్ ఆధారంగా మెట్రో రైల్ పై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, కనీసం పాసింజర్ డైవర్షన్ పది వేలు ఉంటేనే మెట్రో రైల్ కు అనుమతి వస్తుందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

===================

ఆరోగ్యశ్రీ అనుబంధ ఆసుపత్రులకు గత ప్రభుత్వ హయాంలో 2 వేల 536 కోట్ల రూపాయల మేర బకాయిలు ఉన్నాయని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈరోజు ఆయన శాసనమండలిలో సభ్యులు ఇళ్ళ వెంకటేశ్వర రావు, కె.ఎస్. లక్ష్మణరావు, బొర్రా గోపి మూర్తి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ... పేదలకు నాణ్యమైన వైద్యసేవలను నిరంతరాయంగా అందజేసేందుకు వీలుగా డాక్టర్ వైద్యసేవ ద్వారా బకాయిలను దశలవారీగా చెల్లించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఇహెచ్ఎస్) సేవలకు సంబంధించి ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని ఫిర్యాదులు అందాయని, ఎన్టీఆర్ వైద్య సేవతో సమానంగా వైద్యం అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగులకు రీ- ఇంబర్స్ మెంట్ వరకు వెళ్లకుండానే వైద్య సేవలు అందించే ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

===================

తెలుగు సాహిత్యంలో అసమాన ప్రతిభను చాటుకొని, కవిత్వంలో అపారమైన ఖ్యాతిని సొంతం చేసుకున్న కవయిత్రి మొల్ల జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈరోజు మహా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి సందర్భంగా మంత్రి ఆమెకు నివాళులు అర్పించారు. తెలుగు సాహిత్య రంగానికి వెలకట్టలేని కీర్తిని తీసుకువచ్చిన కవయిత్రి మొల్ల జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్ణయించడం సంతోషకరమన్నారు.

విరామం

===================

ప్రజాస్వామ్యానికి మార్గదర్శిగా నిలుస్తున్న రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సిహెచ్ ద్వారకా తిరుమల రావు అన్నారు. ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో 75 సంవత్సరాల రాజ్యాంగం, ఫేక్స్ సదస్సు, మహిళా భద్రతపై విజయవాడలో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన "ఆకాశవాణీయం" అనే పుస్తకాన్ని ఆకాశవాణి విజయవాడ డిప్యూటి డైరెక్టర్ జనరల్ ఎమ్. సోమేశ్వరరావు, ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపాటితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని, భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం మనందరికీ ఎంతో గర్వకారణమని తెలిపారు. పాత్రికేయులు కచ్చితమైన సమాచారాన్ని వెల్లడించాలని ఆయన సూచించారు.

===================

మత సామరస్యానికి రాయచోటి పుట్టినిల్లు లాంటిదని రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, ఎస్పీ లతో కలిసి ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. కొద్దిరోజుల క్రితం జరిగిన చిన్నపాటి ఘర్షణను రెండు వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికి కొంతమంది వ్యక్తులు ప్రయత్నించారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆ ఘటన కొంతమంది వ్యక్తుల మధ్య తలెత్తిన వివాదమే తప్ప వర్గాలకు సంబంధం లేదని మంత్రి స్పష్టం చేశారు. సున్నితమైన అంశాలకు సంబంధించి, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్‌లో ఎలాంటి చిన్నపాటి సంఘటనలు కూడా జరగకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలని మంత్రి ఈ సందర్భంగా సూచిస్తూ....

(వాయిస్ 35 సెకన్లు)

====================

మాదక ద్రవ్యాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించేందుకు విజయనగరం జిల్లా పోలీసులు చేపట్టిన "సంకల్పం" కార్యక్రమానికి ప్రతిష్టాత్మక స్కాచ్ అవార్డు లభించింది. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పోలీసులు డ్రగ్స్ నియంత్రణకు చేపడుతున్న చర్యలను పరిశీలించిన కమిటీ.. విజయనగరం జిల్లా పోలీసు శాఖ చేపట్టిన 'సంకల్పం' కార్యక్రమాలతో సంతృప్తి చెంది, స్కాచ్ అవార్డుకు ఎంపిక చేసిందని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన యువతలో మార్పు తీసుకొచ్చి, వారిని తిరిగి సన్మార్గంలో నడపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని.. ఈ అవార్డుతో తమ బాధ్యత మరింత పెరిగిందని ఆయన చెప్పారు.

====================

భూసర్వేలతో నిరుపేదలకు న్యాయం జరుగుతుందని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలంలోని ఓబులాయపల్లిలో రైతుల గ్రామసభ కార్యక్రమంలో ఈరోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా భూసర్వేలను నిర్వహిస్తున్నామని చెప్పారు. గతంలో భూ సంబంధిత రీ సర్వేలు నిర్వహించామని, అనంతరం గ్రామ గ్రామాలలో అధికారులతో ప్రజా ప్రతినిధులతో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. ప్రజలు ఈ భూ రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

====================

మహా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలు విశాఖ కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. కుమ్మరి శాలివాహన సంఘం డైరెక్టర్ చిరంజీవులుతో కలిసి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, సంయుక్త కలెక్టర్ కె. మయూర్ అశోక్ మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆమె జీవిత విశేషాలను గుర్తు చేసుకున్నారు.

====================
====================